# తోడు

రావి. ఎన్. అవధాని

**'మమ్మీ ఉద్యోగం చెయ్యడ మెందుకు? డాడీ ఉద్యోగం చేస్తున్నారు కదా!**

**'కార్తీక్ వాళ్ల మమ్మీ, అర్జున్ వాళ్ల మమ్మీ, శేఖర్, రాజు వాళ్ల మమ్మీలు ఎవ్వరూ ఉద్యోగాలు చేయడం లేదు. వాళ్ల డాడీలే చేస్తున్నారు.**

ఒక్క శ్రీనూ వాళ్ల మమ్మీయే ఉద్యోగం చేస్తోంది. శ్రీనూ వాళ్ల డాడీ దేవుడి దగ్గరకు వెళ్లి పోయేరుట. మరి తిరిగి రారుట. అలాగని శేఖర్ చెప్పేడు.

'మమ్మీ ఇంత వరకూ రాలేదు. ఈ రోజు కూడా లేటే' అనుకున్నాడు రవి. పుస్తకాల సంచీ, టిఫిన్ డబ్బా, వాటర్ బాటిల్ ఇంటి ముందుంచి, వీధిలోకి మరొక సారి చూసి వచ్చి మెట్ల మీద కూర్చుని బూట్లు విప్పి, సాక్స్ తీసి పక్కన ఉంచేడు.

రవి కాన్వెంటులో మూడో తరగతి చదువుతున్నాడు. రవి తండ్రి మురళీకృష్ణ, తల్లి సునీత ఇద్దరూ ఉద్యోగాలు చేస్తున్నా రు.

రవి సంచీ తెరిచి పుస్తకాలు తీసి హోం వర్క్ పూర్తి చేసేడు. సంచీ పక్కన ఉంచే సరికి అర్జున్, శేఖర్, కార్తీక్, శ్రీనూ, రాజు, మరి కొందరు పిల్లలు క్రికెట్ బ్యాట్లు, స్టంపు, రబ్బరు బంతి పట్టుకొచ్చారు.

"రవీ! నువ్వు ఆటకు రావా?" అని అడిగేడు కార్తీక్.

"ఆఫీసు నుంచి వాళ్ల మమ్మీ ఇంకా రాలేదు రా. వా డెలా వస్తాడు?" అన్నాడు రాజు.

"నిన్నటిలా ఆట మధ్యలో వస్తే నిన్ను జట్టులో వేసుకోము' ' అంటూ హెచ్చరించి పిల్ల లందరూ మైదానం వైపు ఉత్సాహంగా వెళ్లి పోయేరు.

వా ళ్లందరూ తనతో పాటే స్కూలు నుంచి వచ్చేరు. అయితే వాళ్లు అపుడే బట్టలు మార్చుకొని టిఫిన్ తిని, పాలు తాగి ఆడుకుందుకు వెళ్లి పోయేరు. మమ్మీ ఎంత సేపటికీ రాదు అనుకొని చేతి రుమాలుతో కళ్లు తుడుచుకుంటుంటే సునీత రిక్షా దిగి వచ్చి, చేతిలో ఉన్న కూరగాయల సంచీ కింద ఉంచి, పర్స్ లోంచి తాళాలు తీసి, తలుపు తెరిచి కొడుకు వైపు ఒక సారి చూసి కూరగాయల సంచితో లోనికి వెళ్లింది.

రవి బుంగమూతి పెట్టుకొని తన స్కూలు సంచి, టిఫిన్ డబ్బా, వాటర్ బాటిల్, బూట్లు తెచ్చి లోపల ఉంచాడు. కాళ్లూ, చేతులూ, ముఖం కడుక్కొని బట్టలు మార్చుకొని వచ్చేసరికి సునీత పాలు కలిపి ఇచ్చింది. ప్లేటులో నాలుగు బిస్కె ట్లుంచింది.

రవి పాలు తాగాడు. "రోజూ బిస్కెట్లే. నా కక్కర్లేదు" అన్నాడు బయటకు వస్తూ.

'శ్రీనూ వాళ్లింట్లో జంతికలు, చక్కిలాలు, చేగోడీలు, మురీలు చేస్తారు. అట్లాంటివి మమ్మీ ఎప్పుడూ చెయ్యదు. నూనెతో చేసినవి తినకూడదు. అంటుంది. మరి వాళ్లందరూ తినడం లేదేంటి?' అనుకున్నాడు.

మైదానంలో పిల్ల లందరూ అప్పుడే ఆట మొద లెట్టేసేరు.

రవికి మైదానం వైపు వెళ్లాలనిపించ లేదు. వీధి గుమ్మంలో నిల్చున్నాడు.

"రవీ! నువ్వు ఆడుకోడానికి వెళ్లడం లేదా?" సునీత అడిగింది, గుమ్మంలో నిల్చున్న కొడుకును చూసి.

"లేదు" అన్నాడు ఉక్రోషంగా.

"అయితే తలుపులు బార్లా తెరిచి ఎటూ వెళ్లకు' ' అని హెచ్చరించి లోనికి వెళ్లిపోయింది.

రవి మైదానం వైపు చూస్తూ నిల్చున్నాడు.


'ఏంటోయ్! ఈ రోజు ఆటకు వెళ్ల లేదేం?' మురళీ కృష్ణ కారు తలుపు లాక్ చేస్తూ అడిగేడు, మైదానం వేపు చూస్తూ నిల్చున్న కొడుకును.

తండ్రి మాటలకు కాస్త ఉలిక్కిపడి, లేదన్నట్లు తల అడ్డంగా ఊపేడు.

"ఏం, ఎందుకని? వాళ్లతో పోట్లాడేవా? లేక ఒంట్లో బాగు లేదా?" అంటూ వాడి బుగ్గ మీదా, మెడ మీదా చెయ్యి వేసి చూసేడు.

"ఆట మధ్యలో వెళ్తే చేర్చుకుంటా రేంటి?" అన్నాడు కోపంగా.

"ఓ అదా సంగతి? మమ్మీ ఆఫీసు నుంచి ఆలస్యంగా వచ్చింది. మరి మమ్మీని శిక్షిద్దాం" అన్నాడు కొడుకును బుజ్జ గిస్తూ.





### మిస్టర్ హానెస్ట్

**నే**రాల సంఖ్య అధికం అయిన అమెరికాలోకూడా నిజాయితీపరు లుంటారని రుజువు చేశాడు 25 ఏళ్ల లెయినే స్కాట్. ఇతని ఉద్యోగం బాంకుల 'ఏ.టి.ఎమ్.'లని పని చేస్తూండేలా చూడటం. హెండర్సన్ ఊర్లోని ఒక బాంకులో అలాటి ఏటియమ్‌ని పరీక్షిస్తూండగా, డిపాజిట్ బిన్‌లోని 86,000 డాలర్లు అతని కంట పడ్డాయి. ఆ సమయంలో ఒంటరిగా ఉన్న అతగాడు తేలిగ్గా ఆ డబ్బును సొంతం చేసుకుని ఉండవచ్చు కానీ, దాన్ని తన సూపర్‌వైజర్‌కి ఇచ్చి జరిగింది చెప్పాడు.

పదేళ్లనాటి పాత కారును అమ్మి కొత్తది కొనుక్కోవాలని చాలాకాలంగా ఉబలాటపడే ఇతను ఇంత నిజాయితీగా వ్యవహరించడంతో ఆ ఏటియమ్ యజమాని అయిన బాంక్ 2,500 డాలర్లు బహుమతిగా ఇచ్చింది. " 'దొంగతనం తప్పు' అని మా నాన్నగారు నా చిన్నతనంలో చేసిన బోధన న న్నలా చేయించిం"దని అంటా డితను.

**యం. లిపి**

---

"మీ సుపుత్రుడు డెందుకో అలిగాడు. వాడి బుంగమూతి చూడండి" అంది సునీత భర్తకు కాఫీ కప్పు అందిస్తూ.

"అవునోయ్! ఈ రోజు కూడా నువ్వు ఆలస్యంగా వచ్చేవు ..."

"ఇంట్లో కూరగాయ లేం లేవండీ. ఆఫీసు నుంచి అలా మార్కెట్టు కెల్లి కొనుక్కొచ్చేసరికి ఆలస్యం అయింది."

"పాపం వాడు ఆటకు వెళ్లకుండా చేసేవు" అన్నాడు కొడుకు పక్షం వహిస్తూ.

"ఏం, ఎందుకని? వెళ్లి వాళ్లతో ఆడుకో వచ్చుగదా!"

"అది కాదు సునీతా! ఆట మధ్యలో వెళ్లే వీడిని వాళ్లు జట్టులోకి తీసుకోవద్దూ?"

"మీరు మరీ చెప్తున్నారండీ...ఎందుకు వేసుకోరు? వాళ్లంతా మరి వీడి బాటుతోనే కదా ఆడుతున్నారు!"

"అదేంకాదు. అర్జున్ వాళ్ల డాడి, కార్తీక్ వాళ్ల డాడి చిన్న బాట్స్ కొనిచ్చేరు. నా బాటు అదుగో బీర్వాకిం దుంది చూసుకో" అన్నాడు.

"అది సరే...నీ కివ్వాళ మీ స్కూళ్లో ప్రోగ్రెస్ రిపోర్టిచ్చేరా?" అంది సునీత టాపిక్ మారుస్తూ.

"ఇచ్చేరు."

"మరింతవరకూ చూపించలేదేం?"

"మర్చిపోయేను" అన్నాడు మొండిగా.

"అంటే రేంకు హుష్ కాకి అయిందా?" అంది నవ్వుతూ.

రవి విసురుగా వెళ్లి తన స్కూలు బేగులోంచి ప్రోగ్రెస్ కార్డు తెచ్చి తండ్రి కిచ్చేడు.

'ఫస్టరేంకే! వెరీ గుడ్. కంగ్రాచ్యులేషన్స్...కీపిట్ అప్' అని కొడుకుని అభినందించి ప్రోగ్రెస్ రిపోర్ట్ భార్య కిచ్చేడు. మాతృహృదయం ఆనందంతో పొంగిపోయింది. వెంటనే కొడుకుని ముద్దాడింది సునీత.

"రేపు నీ కో మంచి ప్రెజెంట్ కొని తెస్తాను - ఏంకావాలి?" అంది ఎంతో ఆప్యాయంగా.

"నాకేం అక్కర్లేదు" అని ప్రోగ్రెస్ కార్డుమీద తండ్రిచేత సంతకం చేయించి బాగ్‌లో ఉంచుకున్నాడు.

"మీకు స్నానానికి నీళ్లు రెడీగా ఉన్నాయి. డ్రెస్సు మార్చుకుని రండి" అంది సునీత.

"రవీ! ఇంక నువ్వు పుస్తకాలు తీసి హోంవర్క్ చెయ్యి. నేను పది నిమిషాల్లో వస్తున్నాను."

"హోం వర్క్ ఎప్పుడో చేసేసేను."

"ఎప్పుడు చేసేవు? నేను చూస్తూనే ఉన్నాను కదా?"

"నువ్వు రాకముందు మన పోర్టికోలో కూచుని చేసేను. కావలిస్తే చెక్ చేసుకో" అన్నాడు రోషంగా.

సునీత మరేం మాట్లాడకుండా కిచెన్‌లోకి వెళ్లిపోయింది. మురళీకృష్ణ స్నానం చేసివచ్చి సోఫాలో కూర్చున్నాడు.

రవి తండ్రి దగ్గరకు వచ్చి, "డాడీ! మమ్మీ ఎందుకు ఉద్యోగం చేస్తోంది?" అ నడిగాడు.

కొడుకు వేసిన ప్రశ్నకు క్షణకాలం నివ్వెరపోయేడు మురళీకృష్ణ. జవాబు ఏంచెప్పాలో తోచలేదు. నిజానికి సునీత జాబ్ చెయ్యడం మానేయమని తను ఎన్నోసార్లు చెప్పేడు. ఆఫీసరుగా ప్రమోషన్ వచ్చింది; ఇప్పుడు ఎందుకు మానడం అంటుంది.

"అదా! మరి నువ్వు స్కూలుకు, నేను ఆఫీసుకు వెళ్లి సాయంత్రం వస్తాము. మమ్మీ ఒంటరిగా ఇం ట్లో ఉంటే బోరు కొట్టదూ? అందుకని."

"మరి కార్తీక్ వాళ్ల మమ్మీ, శేఖర్ వాళ్ల మమ్మీ, అర్జున్ వాళ్ల మమ్మీ ఇంట్లోనే ఉంటారు. వాళ్లకు బోర్ లేదేంటి? వాళ్లు స్కూల్ నుంచి వచ్చేసరికి వాళ్ల మమ్మీలు ఇంటి దగ్గరే ఉండి వాళ్ల కోసం మంచి మంచి టిఫిన్స్ చేసి ఉంచుతారు" అన్నాడు వస్తున్న ఏడుపును ఆపుకుంటూ.

"వాళ్లకు అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు, నాయనమ్మలు, అమ్మమ్మలు వాళ్లు ఉన్నారు కదా. అందుకని వాళ్లకు బోర్ కొట్టదు. మనింట్లో లేరు కదా!" అన్నాడు కొడుకును దగ్గరకు తీసుకొని.

'అయితే మనం నాయనమ్మను రమ్మందాం.'

"నాయనమ్మనా?"

'ఆc, అవును. పాపం నాయనమ్మ ఒంటరిగా ఉంటోంది కదా! మరి బోరు కొట్టదూ? నాయనమ్మ నాకు చక్కటి కథలు చెపుతుంది. మంచి మంచి టిఫిన్స్ చేస్తుంది. నాయనమ్మను రమ్మను డాడీ!'

"ఓ.కే. రమ్మని ఉత్తరం రాస్తాను."

"ఉత్తరం వద్దు డాడీ! మనకి మూడు రోజులు సెలవు లొస్తున్నాయి. అంచేత మనమే మన కార్లో వెళ్లి నాయనమ్మను తీసుకొద్దాం" అన్నాడు.

"అలాగే."

"ప్రామిస్?" అంటూ చేయి చాపేడు రవి.

"ప్రామిస్" అంటూ కొడుకు చేతిలో చెయ్యి వేసేడు మురళీకృష్ణ.

మురళీకృష్ణ తన తండ్రి చనిపోయిన తరువాత తల్లి అనసూయమ్మను వచ్చి తన దగ్గ రుండమని ఎన్నో మార్లు అడిగేడు. కాని ఆవిడ ఏ కారణం వల్లో అందుకు అంగీకరిం చ లేదు.

అనసూయమ్మకు ధర్మవరంలో పది ఎకరాల పొలం, అన్ని సౌకర్యాలతో ఉన్న పెద్ద ఇల్లు, ఆవిడకు పుట్టింటి వారిచ్చినవి ఉన్నాయి. భర్త కోదండ రామయ్య పోయినప్పటి నుంచీ ఆవిడ పొలం కౌలు కిచ్చి, ఆ వచ్చిన ఆదాయాన్ని దానధర్మాలకూ, పుణ్యకార్యాలకూ వినియోగిస్తూ ధర్మవరం లోనే ఉంటున్నది. దానధర్మాలు చేయడంలో అనసూయమ్మ చేతికి ఎముకే లేదంటారు చుట్టుపక్కల గ్రామాల్లో ని ప్రజలు.

భర్త చేసిన సూచన సునీతకు ఎంతోనచ్చింది. ఆఫీసరుగా ప్రామోషన్ రావడం వల్ల, తను మునుపటిలా నాలు గ్గంటలకు ఆఫీసు వదిలిరా

వడానికి వీలవటం లేదు. అందుచేత తమకు తోడుగా అత్తగారిని తీసుకురావడమే అన్ని విధాలా మంచిది అనుకుంది.

శనివారం ఉదయాన్నే మురళీకృష్ణ భార్యనూ, కొడుకునూ తీసుకొని కారులో ధర్మవరం బయల్దేరేడు.

గుమ్మంలో కారు ఆగగానే రవి కిందకు దిగి "నాయనమ్మా!" అంటూ పరుగు పరుగున ఇంట్లోకి వెళ్లి, అనసూయమ్మ మెడ చుట్టూ చేతులు వేసి, ఆవిడను పట్టుకున్నాడు.

అకస్మాత్తుగా వచ్చి మీద పడ్డ మనవణ్ణి చూసి అనసూయమ్మ క్షణకాలం నివ్వెరపోయి, వాడిని ముద్దు పెట్టుకు న్నది. లోనికి వస్తున్న కొడుకూకోడళ్లను ఆప్యాయంగా పలకరించింది,

వాళ్లు కూర్చుని కుశలప్రశ్నలు వేసుకుంటున్న సమయంలో సుమారు పన్నెండేళ్ల వయస్సున్న అమ్మాయి ఒక ట్రేలో మూడు గ్లాసులతో మంచి నీళ్లు, రెండు కప్పులతో కాఫీ, ఒక కప్పులో పాలు తెచ్చి వారి ముందుంచి, నమస్కారం చేసి, పాలున్న కప్పును రవికి అందించ బోయింది. రవి కప్పు అందుకోకుండా, నాయనమ్మ వైపు చూసేడు.

'అక్క నీ కోసం పాలు తెచ్చింది తీసుకోరా!' అంటూ ఆవిడ కప్పు అందుకొని మనవడి చేత తాగించి పైట చెంగుతో మూతి తుడిచింది.

పసిమి చాయ, గుండ్రటి ముఖం, లంగా, జాకెట్ వేసుకొని, చేతికి రెండేసి గాజులతో, కడిగిన ముత్యంలా ఉన్న ఆ అమ్మాయి ఎవరో అర్థం కాక, భర్త వేపు చూసింది సునీత. అతను తెలియదన్నట్లు తల ఊపడంతో, "అత్తయ్యా! ఎవరీ అమ్మాయి?" అని అడిగింది.

"లలితను నువ్వూ గుర్తు పట్టలేదుట్రా అబ్బాయి? మన శాస్త్రిగారి మనుమరాలు. పాపం, చిన్నతనంలోనే తల్లీదండ్రీ పోయేరు. ఈ అమ్మాయికి మరి నా అన్న వాళ్లు లేరు. ఏదో కాస్త తోడుగా ఉంటుందని తీసుకొచ్చేను. మంచి చురుకైన పిల్ల. నన్ను ఏ పనీ చెయ్యనివ్వదు. చిన్న పిల్లకు చేసినట్లు నాకు సంరక్షణ చేస్తోంది" అంది అనసూయమ్మ.

మరో అర గంటలో లలిత వచ్చి అందర్నీ భోజనాలకు రమ్మని పిలిచింది. వాళ్లు భోజనాల గదిలోకి వెళ్లేసరికి పీటలు వేసి, కంచాల్లో వడ్డన చేసి సిద్ధంగా ఉంది. దోసకాయ పప్పు, గుత్తి వంకాయ కూర, కొబ్బరి చెట్నీ, సేమ్యా పాయసం. వండిన పదార్థాలన్నీ ఎంతో రుచిగా ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు చేసిందా అని ఆశ్చర్యపోవడమే కాక, లలిత పనితనాన్ని మెచ్చుకోకుండా ఉండ లేకపోయింది సునీత.

సునీత భోజనం చేసి వచ్చి ఎంగిళ్లు తీయబోతే లలిత ఆమెను వారించి తనే శుభ్రం చేసింది.

ఒక గంట సేపు విశ్రాంతి తీసుకొని మంచి నీళ్ల కోసం వంటింటి వేపు వెళ్లింది సునీత.

అక్కడ లలిత వాము జంతికలు చేస్తోంది. పక్కనే ఉన్న పళ్లెంలో మరమరాలు పాకంతో ఉండలు చుట్టి ఉన్నాయి.

"అవన్నీ ఇప్పు డెందుకు చేయిస్తున్నారు అత్తయ్యా?" అని అనసూయమమ్మను అడిగింది సునీత.

"నేనేమీ చెయ్యమని చెప్పలేదమ్మా. ఇంతకూ ఏం చేస్తున్నాది?" అని అనసూయమ్మ అంటూంటే లలిత రెండు ప్లేట్లలో వాము జంతికలు, మరమరాల ఉండలు తెచ్చి వారి కిచ్చి, "రుచి చూసి చెప్పండి అన్నీ సరిపోయేయో, లేదో" అంది. రవి రావడంతో, వాడికి కూడా ఇచ్చింది. రవికి మరమరాల ఉండలు బాగా నచ్చేయి. వెంటనే వెళ్లి వాళ్ల డాడీని లేపి వాటిని ఇచ్చేడు.

లలిత గురించి అత్తగారు చెప్పినవన్నీ అతిశయోక్తులు కావని తెలుసుకుందుకు సునీతకు ఎంతో సేపు పట్ట లేదు. అంత చిన్నవయస్సులో ఆ అమ్మాయి పనుల మీద చూపు తున్న శ్రద్ధ, చలాకీతనం చూసి ఎంతో ముచ్చట పడింది సునీత.

"అక్కా! అక్కా!" అంటూ లలిత వెనకాలే తిరుగుతున్నాడు రవి. వాడితో సరదాగా కబుర్లు చెప్తూ నవ్విస్తూ తన పనులు చేస్తోంది లలిత.

రాత్రి భోజనాలైన తరువాత అందరికీ నడివాకిట్లో మంచాలు వేసి పనులన్నీ ముగించుకొని వచ్చి అనసూయమ్మకు నడుము రాస్తోంది లలిత.

అత్తగారిని తమకు తోడుగా తీసుకెళ్దామని వచ్చింది తను. అయితే ఇక్కడ ఆవిడకు తోడుగా నిలిచి ఎన్నో సేవలు చేస్తున్నాది లలిత. అటువంటిది ఆవిడను తీసుకెళ్లి లలిత చేస్తున్న సేవలు తను చెయ్యగలదా? అదే విషయం భర్తతో అంది సునీత.

ఆవిడను తమతో రమ్మనమని ఎలా అడగాలా అని వారు తటపటాయిస్తూంటే -

"నాయనమ్మా! నిన్ను మా ఊరు తీసుకెళ్లడానికొచ్చేను" అన్నాడు రవి.

"అలాగట్రా? మా నాయనే!" అని మనవణ్ణి ముద్దాడింది అనసూయమ్మ.

"అక్కను కూడా మనతో తీసుకెళ్దామా?" అన్నాడు.

"అవునమ్మా. మేము అందు కోసమే వచ్చేము. నువ్విక్కడ ఇంక ఒంటరిగా ఉండొద్దు" అన్నాడు మురళీకృష్ణ.

"అది కాదురా. లలిత ... " అంటూ ఏమో చెప్పబోయింది.

"మీరు మరేం అడ్డు చెప్పకండి అత్తయ్యా! లలితను కూడా మనతో తీసుకెళ్దాం. లలితను నా కన్నకూతుర్లా చూసుకుంటాను. నా కిద్దరు బిడ్డలనుకుంటాను. కూతురూ, కొడుకూ" అంది సునీత.

"ఇద్దరు కాదు, ముగ్గురు. నన్ను మరిచి పోయావు" అన్న అనసూయమ్మ మాటలకు అందరూ హాయిగా నవ్వుకున్నా రు.

Ⓟ


## సప్తపది

**ఏ దేశమేగినా, ఎందుకాలిడినా!**
**కమ్మవారు వివాహ సంబంధములకు సంప్రదించండి**
**వాణి నిలయం, 5—36, బస్ డిపో ప్రక్కన, దుర్గానగర్, దిల్‌షుక్‌నగర్, హైదరాబాదు—500 060.**
**ఫోన్: 040—4046990, 4047219**

**బ్రాంచి: మైనేని వెంకటరత్నం, అన్నపూర్ణ సినిమాహాలు, వీరంకిలాకు—521 250.కృష్ణాజిల్లా.**
**ఫోన్: 08673—82295, 82266**